సంపుటి :02 సంచిక :194 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

# ఏసీబీ వలలో సైట్ ఇంజినీర్



తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సైట్ ఇంజినీర్ (ఔట్ సోర్సింగ్) సామల రమేష్ రూ.8,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జనగామ జిల్లాలోని కొడకండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనుల తుది బిల్లును ప్రాసెస్ చేసేందుకు బాధితుడి నుంచి మొత్తం రూ.18,000 లంచం డిమాండ్ చేశాడు. ఇందులో భాగంగా, ముందుగా రూ.10,000 ఫోన్‌పే ద్వారా స్వీకరించాడు. మిగతా రూ.8,000 శుక్రవారం తన కార్యాలయంలో తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు మెరుపుదాడి చేసి పట్టుకున్నారు. రమేష్ నుంచి రూ.8,000 స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు అతడిని అరెస్టు చేసి, ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.

– అక్షర దర్బార్, వరంగల్

గురువారం 26, సెప్టెంబర్ 2025




ఏ క్షణంలోనైనా

# ఎన్నికల షెడ్యూల్?

02


## దసరా తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్

## రెండు రోజుల్లో రిజర్వేషన్ల జీవో జారీ?

### ఇప్పటికే సర్వం సిద్ధంచేసిన యంత్రాంగం!

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 26 లేదా 27న జారీ అవుతుందా? దస రా తర్వాత ఏ క్షణమైనా నోటిఫికేషన్ విడుదల అవుతుందా? అంటే రాష్ట్రంలో అధికార యంత్రాంగం వడివడిగా చేపట్టిన ఎన్నికల ముందస్తు కసరత్తు దానికి సంకేతంగా కనిపిస్తున్నది. దసరా తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని సమాచారం.

– అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి




# నిర్లక్ష్యపు తీరాన దవాఖాన

## వివాదాలకు కేంద్ర బిందువుగా ‘ఎంజీఎం’

ఉత్తర తెలంగాణకు సంజీవనిగా, ఆరోగ్యదాయినిగా విలసిల్లిన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి పేరు ప్రఖ్యాతలు ఇప్పుడు మసకబారుతున్నాయి. వరుసగా ఆసుపత్రి పరిధిలో జరుగుతున్న ఘటనలు ప్రజలను విస్తుపోయేలా చేస్తున్నాయి. మొన్నటికి మొన్న వైద్యసిబ్బంది ఒక మహిళకు ఒక బ్లడ్ గ్రూప్ రక్తం ఎక్కించాల్సి ఉండగా, మరో రకం బ్లడ్ ఎక్కించారు. బుధవారం వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ రెండు నెల పసికందు కన్నుమూసింది. ఈ రెండు ఘటనలు ఆస్పత్రిని కుదిపేశాయి. బాధిత కుటుంబాలు ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిని బాధ్యులను చేయలంటా ఆందోళన చేపట్టారు. - అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి

- మహిళకు క్రాస్ బ్లడ్ గ్రూప్ ఎక్కించిన సిబ్బంది
- పిల్లల వార్డులో కరెంట్ కట్ ..ఊపిరాడక పసికందు మృతి
- ఆపరేటర్ లేకపోవడంతో పేలిన ఆక్సిజన్ ఫ్లోమీటర్
- ఆన్ చేయాలని చూసిన స్వీపర్‌కు గాయాలు
- వరుస ఘటనలతో మసకబారుతున్న ఆస్పత్రి ప్రతిష్ఠ

03



రేపటి నుంచి

# మద్యం దుకాణాలకు దరఖాస్తులు

03

- వచ్చే నెల 18వ వరకు గడువు
- ఇదే నెల 23న లాటరీ పద్ధతిలో దుకాణ కేటాయింపులు
- రిజర్వేషన్ దరఖాస్తుదారులకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 2,620 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రకటించింది. వచ్చేనెల 23న లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు ఉంటుందని తెలిపింది, రెండేళ్ల కాలానికి (2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు) అనుమతులతో ఎక్సైజ్ శాఖ కొత్త లైసెన్సులు జారీ చేయనుంది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుము రూ.3 లక్షలు. దుకాణాల కేటాయింపులో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5శాతం రిజర్వేషన్లు ఉంటాయి. రిజర్వేషన్ దరఖాస్తుదారులకు కుల ధ్రువీకరణ తప్పనిసరి.

- అక్షర దర్బార్, హైదరాబాద్ ప్రధాన ప్రతినిధి



# నేడు, రేపు వర్షసూచన

## ములుగు జిల్లాలో కుండపోత

గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ వర్షసూచన ఉన్నట్లు గురువారం హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఎల్లుండి ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంది

– అక్షర దర్బార్, హైదరాబాద్

03

- ఐటీ మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- కాటారంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

# 'ఇందిరమ్మ'తో సొంతింటి కల సాకారం




అక్షర దర్బార్, కాటారం : అర్హులపైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి వారి సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గురువారం కాటారం మండల కేంద్రంలోని బిఎల్ఎం గార్డెన్స్ లో 300 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడ్ ప్రమోషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, గ్రంధాలయ ఛైర్మన్ కోట రాజబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుమల సమ్మయ్య, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహనిర్మాణ శాఖ అధికారులు, మహిళా, శిశు సంక్షేమ అధికారులు మల్లీశ్వరి, మిషన్ భగీరథ ఈఈ శ్వేతా, మహాదేవపూర్ సింగిల్ విండో ఛైర్మన్ తిరుపతి రెడ్డి, సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "ప్రతి నిరుపేద సొంత ఇంటిలో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం దీని కోసం రూపుదిద్దుకుంది. లబ్ధిదారులు ఇళ్లను 400–599 చదరపు అడుగుల సైజులో నిర్మించాలి. నిర్మాణంలో జాప్యం ఉంటే, సంబంధిత అధికారుల వేతనాల నుండి కోత విధిస్తాము. అవినీతికి పాల్పడినవారి మీద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు అంగన్వాడి చిన్నారులకు అక్షరాభ్యాసం ప్రారంభించగా, గర్భిణీ స్త్రీలకు సీమంతం, లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఆయన మరోసారి పేదలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, వడ్డీ లేని రుణాలు, రైతు రుణ మాఫీ, విద్యార్థుల డైట్ తదితర సంక్షేమ పథకాల వివరాలు తెలిపారు.



# ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్?

- దసరా తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్
- రెండు రోజుల్లో రిజర్వేషన్ల జీవో జారీ?
- ఇప్పటికే సర్వం సిద్ధంచేసిన యంత్రాంగం!




అక్షర దర్బార్, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 26 లేదా 27న జారీ అవుతుందా? దస రా తర్వాత ఏ క్షణమైనా నోటిఫికేషన్ విడుదల అవుతుందా? అంటే రాష్ట్రంలో అధికార యంత్రాంగం వడివడిగా చేపట్టిన ఎన్నికల ముందస్తు కసరత్తు దానికి సంకేతంగా కనిపిస్తున్నది. దసరా తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని సమాచారం. చట్టబద్ధంగా నిలుస్తుందా? లేదా? అన్న అంశంతో సంబంధం లేకుండా హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఏర్పాట్లకు సిద్ధమవుతున్నది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం తన సంసిద్ధతను తెలుపుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి నేడో, రేపో లేఖ రాసే అవకాశం కనిపిస్తున్నది. రిజర్వేషన్ల వివరాలను అందించనున్నట్టు సమాచారం. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లపై గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం జీవో జారీ చేస్తారని, ఆ జీవోతోపాటు షెడ్యూల్ ఒకే సమయంలో వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

## సీఎంవోలో రిజర్వేషన్ల జీవో

ఎన్నికల ప్రక్రియను ఒకసారి మొదలుపెట్టిన తర్వాత కోర్టులు పెద్దగా జోక్యం చేసుకోకపోవచ్చన్న భావనతో అధికారులు ఉన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంపిన బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నది. ఈ నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల కోసం జీవో ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుండగా, డ్రాఫ్ట్ జీవోను ఇప్పటికే సిద్ధంచేశారు. న్యాయ, సంక్షేమ శాఖ ల కార్యదర్శుల పరిశీలన కూడా పూర్తయి సీఎంవోలో ఉన్నది. 26న స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ ఇచ్చి దసరా తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెల్సింది. హైకోర్టు ఈనెల 30లోపు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని చెప్పిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టామని ప్రభుత్వం కోర్టుకు చెప్పుకునేందుకు 26న షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నట్టు చెప్తున్నారు.

## రేపు, ఎల్లుండి అధికారులకు శిక్షణ

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ అధికారుల(పీవో)ను నియమించాలని అన్ని కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లేఖలు రాశారు. నియమించిన పీవోలకు రెండు రోజులపాటు జిల్లాల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 26, 27న డివిజన్ల వారీగా శిక్షణ ఏర్పాట్లు చేశారు.



### జోరుగా కురుస్తున్న వర్షాలు

# బోరున విలపిస్తున్న పత్తి రైతు

## ఎడతెరిపిలేని వానలతో పత్తి పంటకు తీవ్ర నష్టం

అక్షర దర్బార్ శాయంపేట : మండలంలోని గ్రామాలలో పత్తి సాగు చేస్తున్న రైతులకు అతివృష్టి.. అనావృష్టి కారణంగా తిప్పలు తప్పడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నది. పంట నీట మునిగి రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది. కురుస్తున్న వర్షాలు పత్తి రైతులను చిత్తు చేస్తోంది. ఈ వానాకాలం సీజన్ ఆరంభంలో వర్షాభావం, ఇప్పుడు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధికవర్షాలు రైతులను నిలువునా ముంచుతోన్నాయి. ఏపుగా ఎదిగి ఊపుమీదున్న పత్తి పంట అతివృష్టితో పూర్తిగా దెబ్బతిన్నది. వర్షపు నీటికి పత్తికాయలు రాలిపోవడమే కాకుండా పత్తిమొక్కలు కూడా మురిగిపోయాయి. పంటను రక్షించుకునేందుకు ఆరంభం నుంచే ఎన్నో అవస్థలు పడిన రైతులకు వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# పండిట్ దీన్ దయాల్ ఆశయాలను కొనసాగించాలి







అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల బిజెపి కార్యాలయంలో పండిత్ దీన్ దయల్ ఉపాధ్యాయ 109వ జయంతి ఘనంగా నిర్వహించబడింది. బుర్ర వెంకటేష్ గౌడ్ దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళి అర్పించారు. వేదికపై వెంకటేష్ గౌడ్, దేశభక్తి, ధర్మ సేవలో దీన్ దయల్ ఉపాధ్యాయ కీలక పాత్ర పోషించినది, ఆయన ఆశయాలను కొనసాగించాలి అని తెలిపారు. కార్యక్రమంలో మైదం శ్రీకాంత్, చెక్క నరసయ్య, నీలి సుధాకర్ రెడ్డి, గుర్రపు రవి, ఏ లేటి శ్రీనివాస్ రెడ్డి, బండారి భద్రయ్య, అనుప మహేష్, కేంసారాపు ప్రభాకర్, మదరపు రాజు, గొపగాని రాజు, బురి తిరుపతి, బోయిని అజయ్ కథం రాజు పాల్గొన్నారు.

## శాయంపేటలో..

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలో బిజెపి అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి ఘనంగా నిర్వహించబడింది. రామకృష్ణ ఆయన జీవితం, సేవలు, సూత్రాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో భూతం తిరుపతి, కొత్తపల్లి శ్రీకాంత్, కోమటి రాజశేఖర్, బాసాని నవీన్, గొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో..

అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లా బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబెల్లి రఘునాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆలోచనలు ప్రతి కార్యకర్తకు మార్గదర్శకమని రఘునాథ్ అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. నిషిధర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రతి అడుగు పేదలు, రైతులు, కార్మికుల కోసం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం : తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏటూరు నాగారం పోలీస్ సబ్ డివిజన్ అదిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గురువారం ఆయన మీడియాకు ఇచ్చిన ప్రకటనలో, గోదావరి నది పరివాహక ప్రాంత గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని తెలిపారు. వాజేడు మండలం, పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్నందున, జాతీయ రహదారి 163 పై టేకులగూడెం శివారులోని వంతెనపై వరద నీరు ప్రవహిస్తున్నందున, వరద తగ్గే వరకు వంతెనపై ప్రయాణాలను నిషేధిస్తూ, అక్కడ భారీ కేట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం తీసుకోవాలని, ప్రయాణం చేయాల్సి వచ్చినప్పటికి భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మార్గాన్ని ఉపయోగించాలని సూచించారు.

# తీజ్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర



అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుందూరుపల్లి గ్రామంలో లంబాడీ సోదర సోదరీమణులు, బంధుమిత్రులతో కలిసి ఘనంగా నిర్వహించిన తీజ్ పండుగ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం సద్దుల బతుకమ్మకు ముందుగా గిరిజన తండాలు, గ్రామాల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగను జరుపుకుంటారని గుర్తు చేశారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుకలో తాను కుటుంబ సభ్యుడిగా ఆహ్వానించబడటం సంతోషకరమని, ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని గండ్ర వెంకట రమణా రెడ్డి పేర్కొన్నారు.

# శ్రీ మహాలక్ష్మి దేవి అవతారంలో అమ్మవారు



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ,మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4 వ రోజు శ్రీ మహాలక్ష్మి దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.వేద పండితులు మణిదీప్ శర్మ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు,హోమం నిర్వహించడం జరిగింది,అనంతరం ముడతనపల్లి రజిత చేరాలు అన్న ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివ ప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.






# నిర్లక్ష్యపు తీరాన పేదల దవాఖాన

## వివాదాలకు కేంద్ర బిందువుగా ‘ఎంజీఎం’

- మహిళకు క్రాస్ బ్లడ్ గ్రూప్ ఎక్కించిన సిబ్బంది
- పిల్లల వార్డులో కరెంట్ కట్.. ఊపిరాడక పసికందు మృతి
- ఆపరేటర్ లేకపోవడంతో పేలిన ఆక్సిజన్ ఫ్లోమీటర్
- ఆన్ చేయాలని చూసిన స్వీపర్కు గాయాలు
- వరుస ఘటనలతో మసకబారుతున్న ఆస్పత్రి ప్రతిష్ఠ

**అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి :**

ఉత్తర తెలంగాణకు సంజీవనిగా, ఆరోగ్యదాయినిగా విలసిల్లిన వరంగంల్లోని ఎంజీఎం ఆస్పత్రి పేరు ప్రఖ్యాతలు ఇప్పుడు మసకబారుతున్నాయి. వరుసగా ఆసుపత్రి పరిధిలో జరుగుతున్న ఘటనలు ప్రజలను విస్తుపోయేలా చేస్తున్నాయి. మొన్నటికి మొన్న వైద్యసిబ్బంది ఒక మహిళకు ఒక బ్లడ్ గ్రూప్ రక్తం ఎక్కించాల్సి ఉండగా, మరో రకం బ్లడ్ ఎక్కించారు. బుధవారం వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ రెండు నెల పసికందు కన్నుమూసింది. ఈ రెండు ఘటనలు ఆస్పత్రిని కుదిపేశాయి. బాధిత కుటుంబాలు ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిని బాధ్యులను చేయలంటా ఆందోళన చేపట్టారు.

### పేలిన ఆక్సిజన్ ఫ్లోమీటర్స్..

ఎంజీఎం ఆస్పత్రిలో మార్చి నెలలోని ఆర్థోపెడిక్ విభాగంలో ఆక్సిజన్ ఫ్లోమీటర్ సిలిండర్కు అనుసంధానం చేయాల్సిన బాయ్ అందుబాటులో లేకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది దానిని ఆపరేట్ చేశారు. దీంతో ఫ్లోమీటర్ పేలింది. ఘటనలో స్వీపర్కు తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ నెల 12న అత్యవసర విభాగంలోనూ సిబ్బంది ఆక్సిజన్ సిలిండర్ అనుసంధానం చేస్తున్న క్రమంలో ఫ్లోమీటర్ పేలింది. హనుమకొండ జిల్లా అయోధ్యాపురానికి చెందిన జ్యోతి ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరింది. ఆమెకు రక్తం ఎక్కించాలనివైద్యులు నిర్ణయించారు. అయితే.. ఆమెకు ‘ఓ’ పాజిటివ్ గ్రూప్ రక్తం ఎక్కించాల్సి ఉండగా, సిబ్బంది ‘బీ’ పాజిటివ్ రక్తం ఎక్కించారు. టెక్నీషియన్ల నిర్లక్ష్యమా.. సిబ్బంది అలసత్వమా తెలియదు గానీ, బాధితురాలి ప్రాణం మీదకు వచ్చింది. ఘటనపై ఆస్పత్రి అధికారులు విచారణకు ఆదేశించారు.

### పసికందు మృతి..

ములుగు జిల్లా వాజేడు మండలం ఏడుచెర్లపల్లి గ్రామానికి చెందిన గౌరారపు సంధ్య, గణేశ్ దంపతుల కుమారుడు రెండు నెలల చిన్నారి మోక్షిత్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో వారు వరంగల్లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు చిన్నారిని ఇంక్యూబేటర్లో ఉంచారు.రెండు రోజుల పాటు చికిత్స అందించగా, మూడోరోజు ఆస్పత్రికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో చిన్నారి ఊపిరాడక మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే చిన్నారి మృతిచెందాడని కుటుంబం సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి కుట్లు వేయడానికి సర్జికల్ సామగ్రి అందుబాటులో లేదని చెప్పి, వైద్య సిబ్బంది లంచం డిమాండ్ చేశారు. ఇటీవల విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకుగాను ఇద్దరు డాక్టర్లతో పాటు ఒక మెడికోను ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెండ్ చేశారు.

### మృతదేహం మార్పిడి కేసు..

ఈ ఏడాది జూలైలో ఆస్పత్రిలో మృతదేహం మార్పిడి కేసు సంచలనం సృష్టించింది. వరంగల్ జిల్లా మైలారానికి చెందిన కుమారస్వామి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. కానీ, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకున్న తర్వాత వైద్య సిబ్బంది వారికి ఒక మృతదేహాన్ని అప్పగించారు. కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలని చూడగా, ఆ మృతదేహం కుమారస్వామిది కాదు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వచ్చి నిలదీశారు. చివరకు కుమారస్వామి బతికే ఉన్నాడననే విషయం తేలింది.

### కూలిన పైపెచ్చులు..

పురుషుల సర్జికల్ వార్డులో జూలై 27న భవనం పైకప్పు పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమ యంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. వానకాలంలో ఇలాంటి ఘటనలే జరుగుతుండగా, ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

### ఒకే రోజు 77 మందికి మెమోలు




**విధుల పట్ల నిర్లక్ష్యం, వృత్తి పట్ల అలసత్వంగా వ్యవహరించిన 77 మంది వైద్యులు, వైద్యసిబ్బందిపై ఆస్పత్రి అధికారులు మే నెలలో మెమోలు జారీ చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. అలాగే ఆస్పత్రి పరిధిలో ఎన్నో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అందుకే రోగులకు సరైన చికిత్స అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒకప్పుడు ఆస్పత్రి పరిధిలో రెగ్యులర్ వార్డ్బాయ్స్, స్వీపర్లు, టెక్నికల్ సిబ్బంది అందుబాటులో ఉండేవారని, ఇప్పడా సేవలు లేకపోవడంతోనే వరుసగా దురదృష్టకర ఘటనలు సంభవిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. వైద్యారోగ్యశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆస్పత్రిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నది.**

# రేపటి నుంచి మద్యం దుకాణాలకు దరఖాస్తులు

- వచ్చే నెల 18వ వరకు గడువు
- ఇదే నెల 23న లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపులు
- రిజర్వేషన్ దరఖాస్తుదారులకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

అక్షర దర్బార్, హైదరాబాద్: మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 2,620 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రకటించింది. వచ్చేనెల 23న లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు ఉంటుందని తెలిపింది, రెండేళ్ల కాలానికి (2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు) అనుమతులతో ఎక్సైజ్ శాఖ కొత్త లైసెన్సులు జారీ చేయనుంది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుము రూ.3 లక్షలు. దుకాణాల కేటాయింపులో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5శాతం రిజర్వేషన్లు ఉంటాయి. రిజర్వేషన్ దరఖాస్తుదారులకు కుల ధ్రువీకరణ తప్పనిసరి.



# నేడు, రేపు వర్షసూచన

## ములుగు జిల్లాలో కుండపోత

అక్షర దర్బార్, హైదరాబాద్: గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ వర్షసూచన ఉన్నట్లు గురువారం హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఎల్లుండి ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంది. గురువారం సాయంత్రం భూపాలపల్లి, ములుగు, జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ములుగు జిల్లాల్లో వర్షం దంచి కొడుతున్నది. గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వాన పడుతున్నది. జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి, ములుగు, గోవిందరావుపేట, మల్లంపల్లి మండలాల్లో ఆగకుండా వాన కురుస్తున్నది. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



# అనారోగ్యానికి గురైన జర్నలిస్టుకు ఆర్థిక సాయం

అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల ప్రెస్ క్లబ్ సభ్యుడు, నైన్ పాక గ్రామానికి చెందిన మోకిడి సతీష్ ఇటీవల అనారోగ్యంతో బాధ పడటంతో ఆయనకు చికిత్స అందించారు. వైద్యానికి లక్షల రూపాయల ఖర్చు ఏర్పడటంతో, తోటి జర్నలిస్టులు ఆయనను ఆత్మీయంగా పలకరించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమాన్ని చిట్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాటేవుల ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, "ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేసే జర్నలిస్టులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నప్పటికీ సమాజ హితం కోసం సేవ కొనసాగిస్తున్నారు. గ్రామీణ స్థాయి జర్నలిస్టులకు వైద్య, ఆర్థిక సౌకర్యాలు అందకపోవడం సమస్య" అని పేర్కొన్నారు. క్లబ్ సీనియర్ సభ్యులు చింతల రమేష్, ముదిరాజ్ శృంగారపు, రంగాచారి పుల్ల రవితేజ, కట్కూరి రమేష్, సరిగోమ్ముల రాజేందర్, బుర్ర రమేష్, కట్కూరి శ్రీనివాస్, గుర్రపు రాజమౌళి, మడిపడుగుల సంపత్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

అక్షర దర్బార్, పరకాల: పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గురువారం పరకాల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా అర్హులైన 70 మంది లబ్ధిదారులకు రూ.20.50 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పార్టీ అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా పరిష్కరించినట్లు చెప్పారు. ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, ఇళ్ల పంపిణీ, రేషన్ కార్డులు వంటి పలు సంక్షేమ పథకాల అమలుపై ఆయన వివరించారు.



# 'సద్దుల'కు అన్ని ఏర్పాట్లు

అక్షర దర్బార్, పరకాల: గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని దామెర చెరువు వద్ద జరుగనున్న సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అవసరమైన అన్ని సౌకర్యాలను సమయానికి అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఉత్సవంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

చిట్యాల, సెప్టెంబర్ 25 – చిట్యాల మండల కేంద్రంలో గురువారం ముస్లింల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాన్ని మండల మాజీ కో–ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ రాజ్ మహమ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం మైనార్టీ వర్గాల కోసం రెండు పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన కింద వితంతు మహిళలకు రూ.50వేల సాయం, రేవంత న్నకా సహారా స్కీమ్ కింద 21–55 ఏళ్ల మధ్య యువతీ, యువకులకు రూ.లక్ష సాయం అందించనున్నారు. దరఖాస్తులు అక్టోబర్ 6 వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల జనరల్ సెక్రెటరీ గడ్డం కొమురయ్య, మైనారిటీ నాయకులు రంజాన్ అలీ, రషీద్, ఆటో అంకుష్, సాధిక్, తాయూబ్, అబ్దుల్ రెహమాన్, మహబూబ్ అలీ, అక్బర్ పాల్గొన్నారు





# ప్రాధాన్యత రంగాలకు అధిక రుణాలు అందించాలి

- రైతులకు అత్యధికంగా పంట రుణాలనివ్వాలి
- భూపాలపల్లిలో బ్యాంకర్ల సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షరదర్బార్, భూపాలపల్లి కలెక్టరేట్ : ప్రాధాన్యతా రంగాలకు అధిక రుణాలను అందించాలని భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు(గురువారం) భూపాలపల్లి కలెక్టరేట్ లోని ఐడీవోసీ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో కో ఆర్డినేషన్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణ లక్ష్యం రూ.1221.72 కోట్లు కాగా, అందులో రూ.136.74 కోట్ల రుణ లక్ష్యం సాధించినట్లు బ్యాంకర్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. జిల్లాలో పంట రుణాలు, హౌసింగ్ లోన్లు మరియు ఎడ్యుకేషన్ లోన్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు అందించాలన్నారు. ఆయా బ్యాంకుల్లో పెండింగ్లో ఉన్న యూనిట్లను బ్యాంకు అధికారులతో తరుచూ సంప్రదించి రుణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్ధిదారులకు అవగాహన పరిచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఉన్న రైతు వేదికల్లో ప్రతినెలా సమావేశాలు చేపట్టి రుణ ప్రగతి పెంచేందుకు కృషి చేయాలన్నారు. మహిళా శక్తి ఇనిషాటివ్ ప్రోగ్రాం కింద SHG మహిళలకు మోడల్ CSC సెంటర్స్ ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా, రుణాలు పొందే వారికి కూడా రుణాల వినియోగంలో లబ్ధిదారులకు అధికారులు వెన్నంటి ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు.





## బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ

భూపాలపల్లి నియోజకవర్గం చిట్యాల మండలం వరికోల్ పల్లి(కుమ్మరిపల్లి) గ్రామానికి చెందిన శ్రీరాముల విష్ణు వర్ధన్, పాల రజిత ఇటీవల జరిగిన కాళేశ్వరం పుష్కరాలకు వెళ్తూ కమలాపురం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. కాగా, వారి కుటుంబ సభ్యులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున చెక్కులను భూపాలపల్లి కలెక్టరేట్ లో అందజేశారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని, ప్రభుత్వం తరపున కూడా ఎలాంటి సహకారం అవసరం ఉన్నా అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు.

# గుంతల రోడ్డుకు మాజీ ఎమ్మెల్యే మరమ్మతులు

## చల్లా ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లె నుండి మల్లారెడ్డిపల్లిగూడెం వరకు వెళ్లే రహదారి బురదమయమై రైతులు, సాధారణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితుల్లో, ఈ సమస్యను బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి తెలియజేశారు.రైతుల కష్టాలను సమీక్షించిన చల్లా ధర్మారెడ్డి తక్షణమే స్పందించి, తాత్కాలికంగా రోడ్డుకు మొరం పోయించి ప్రయాణదారులకు ఉపశమనం కలిగించారు. ఆయన ఈ చర్యకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ, అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ, "రైతుల సమస్యలపై ఇలా వెంటనే స్పందించిన ధర్మారెడ్డికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఎవరూ పట్టించుకోని సమయంలో ఆయన ముందుకు రావడం అభినందనీయం," అన్నారు.



# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరానికి రూ.25 వేలు పరిహారం అందించాలి
- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్

అక్షర దర్బార్, వరంగల్ : అధిక వర్షాలతో పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు 25,000 రూపాయల పరిహారం ఇవ్వాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐకేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పెద్దారపు రమేష్, యూరియా కొరత, సబ్సిడీ రద్దు, ఎరువుల, రుణాల, విత్తనాల సరఫరా లో ప్రభుత్వ విఫలతలతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో లక్ష 14 వేల ఎకరాల్లో పత్తి పంటలు నష్టపోతున్న పరిస్థితి నెలకొన్నందున, రైతులని గుర్తించి ఎకరాకు పరిహారం ఇవ్వాలని, పత్తిని మద్దతు ధరలో కొనుగోలు చేయాలని, విదేశీ పత్తి దిగుమతులపై ఎత్తివేసిన సుంకాలను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనె కుమార స్వామి, జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఇస్మాయిల్, కుసుంబా బాబురావు, నాగెల్లి కొమురయ్య, గోనే రామచందర్, మహమ్మద్ రాజా సాహెబ్, చెవ్వ కుమారస్వామి, మొగిలి సోమిడి రవి, దేవర రాజు, రాజమల్లు వెంకట స్వామి, రాజేందర్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915